క్లుప్తంగా

రైతులకు విత్తనాల పంపిణీ



శాతనకోటలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వీఏఏ

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని శాతనకోట గ్రామ రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం వారు అందించిన సోయాబీన్ సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏఓ షేక్షావలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ విత్తనాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్సిడీ విత్తనాలు తీసుకోవాలనే రైతులు తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిష్టర్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

నందికొట్కూరు: నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆది డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్ష ప్రశ్న పత్రాలను ఒక రోజు ముందు లీక్ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. 67 మందికి రూ. కోట్ల రూపాయలకు నీట్ ప్రశ్న పత్రాలను బీజేపీ ప్రభుత్వం అమ్మేయడంతో 67 మందికి 720 మార్కులు వచ్చాయని ఆరోపించారు. చరిత్రలో 720కి 720 మార్కులు ఎవరికీ రాలేదని 719, 718, 717 ఇలా వచ్చాయని గుర్తు చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేస్తే పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా రావడంతో గ్రేస్ మార్కులు కల్పించామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రజలకు శుద్ధ జలాన్ని అందించాలి



ఏఓకు వినతి పత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు శుద్ధ జలాన్ని అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ స్వాములు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అబ్రహం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ కరుణసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువలను శుభ్రం చేయాలని కోరారు. 13, 14వ ఆర్థికసంఘం నిధులు దుర్వినియోగం కాకుండా పారిశుద్ధ్యం కోసం ఖర్చు చేయాలన్నారు.

ఎఫ్‌ఎస్‌ఓకు డీఆర్‌ఓగా పదోన్నతి



పదోన్నతి పొందిన రవీంద్రనాయక్

మహానంది: బండి ఆత్మకూరు మండలం జీసీ పాలెంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రవీంద్రనాయక్‌కు పదోన్నతి లభించింది. ఈ మేరకు అటవీశాఖ ఉన్నతాధికారులు శనివారం ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతి పొందిన ఆయనను మండల అటవీశాఖ అధికారులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

వర్మీకంపోస్టు తయారీపై శిక్షణ

మహానంది: వ్యవసాయ వ్యర్థాలను సమర్థవంతంగా ఎరువుగా మార్చుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మహానంది వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రవికిశోర్ తెలిపారు. తమ్మడపల్లె గ్రామంలో శనివారం వానపాముల ద్వారా ఎరువు తయారీకి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వానపాముల ద్వారా తయారు చేసుకునే వర్మీకంపోస్టుతో మేలైన దిగుబడులు పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన రైతులకు కళాశాలలోని వానపాముల ఎరువుల తయారీ వద్ద శిక్షణ ఇస్తామన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: మండలంలోని అహోబిలం గ్రామంలో శనివారం లక్ష్మయ్య(20) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి మందలించాడని ఎగువ అహోబిలం బైపాస్ రోడ్డులోనున్న రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

కుందూలో అక్రమ తవ్వకాలు

- ట్రాక్టర్ మట్టి రూ.1,000 నుంచి రూ.1,500 వరకు విక్రయం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- టీడీపీ నేతలే సూత్రధారులంటున్న గ్రామస్తులు



కుందూనదిలో మట్టి తవ్వుతున్న జేసీబీ



ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం

మహానంది: బండిఆత్మకూరు సమీపంలోని కుందూనది నుంచి ఇసుక, మొరుసును అక్రమంగా తరలించి పలువురు టీడీపీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుందూ నది నుంచి ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండిఆత్మకూరుకు చెందిన ఓ టీడీపీ నేత జేసీబీ, ఎనిమిది ట్రాక్టర్లను పెట్టి మట్టిని తరలిస్తుండటం శనివారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. సాధారణ పేదలు తమ గృహ నిర్మాణాల కోసం ఒక ట్రిప్పు ట్రాక్టర్ మట్టి తరలించుకుంటే వివిధ నిబంధనల పేరుతో ఎన్నో ఇబ్బందులకు గురిచేసే రెవెన్యూ అధికారులకు పట్టపగలే నాయకులు ట్రాక్టర్ల కొద్దీ తరలిస్తుంటే చూసీ చూడనట్లు వ్యవహరించడంపై సమీప గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు నాయకులు వారికి వత్తాసు పలుకుతున్నారంటూ చర్చించుకుంటున్నారు.

వర్షాల నేపథ్యంలో మట్టికి డిమాండ్

ప్రస్తుతం వర్షాలు జోరుగా కురుస్తుండటంతో మార్కెట్‌లో మంచి మట్టి దొరకడం లేదు. దీంతో వివిధ రకాల గృహ, వాణిజ్య అవసరాలకు మట్టి, గ్రావెల్ ప్రస్తుతం ఎంతో అవసరం. అయితే ఇదే అదనుగా భావించిన టీడీపీ నేతలు మట్టిని ట్రాక్టర్ ద్వారా ట్రిప్పుకు రూ.1,000 నుంచి రూ. 1,500 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై బండి ఆత్మకూరు తహసీల్దార్ సుమతిని సంప్రదించగా.. మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. విషయం తెలిసిన వెంటనే కుందూ నది వద్దకు వెళ్లి తవ్వకాలు, తరలింపును నిలిపేశామని తెలిపారు. అనుమతులు లేకుండా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గాజులపల్లె వంత నుంచి..

గాజులపల్లెలోని అంకిరెడ్డిచెరువు సమీపంలోని వంక నుంచి కొందరు గ్రావెల్ మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఏర్పాటు చేసి మట్టిని తరలిస్తుండటంతో నంద్యాల–గిద్దలూరు నల్లమల మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడంతో పాటు తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు: రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని గౌడ్‌సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునేద్‌బాషా, ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ నీట్ పరీక్ష ఫలితాల్లో జరిగిన అక్రమాలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు వర్దన్, మండల నాయకులు హేమంత్, మహీంద్ర, చిన్న, పీడీఎస్‌యూ నాయకులు రామాంజనేయులు, ఇర్ఫాన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

వెలుగోడు: మండలంలోని గుంతకందాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జనసేన ఆధ్వర్యంలో స్టేషనరీ పంపిణీ చేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ, కుర్చీలు, ఫ్యాన్లు, స్కూల్‌కు ఉపయోగకరమైన వస్తువులను అందజేశారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. యర్రప్రాని మహేష్, నాగతేజ, లక్ష్మణ నాయక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వాహనాన్ని ఢీ కొన్న ట్రాక్టర్



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన పోలీసు వాహనం



తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ లక్ష్మణ్

ఆత్మకూరు రూరల్: మండలంలోని శ్రీపతిరావు పేట క్రాస్ (రాధాపురం) వద్ద శనివారం మట్టి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ పోలీసులు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మణ్ తీవ్రంగా గాయపడగా, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. నూతన ఐఏఎస్‌లు తమ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా బైర్లూటి జంగిల్ క్యాంప్‌కు వచ్చారు. వారిని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కలిశారు. కార్యక్రమానికి బందోబస్తు నిర్వహణ కోసం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన వారు బైర్లూటి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన కానిస్టేబుళ్లను డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ లక్ష్మీనారాయణ పరామర్శించారు.

పంట కాల్వను ఆక్రమిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు



కాల్వను ఆక్రమించి కట్టిన రాతి కట్టడాలను పరిశీలిస్తున్న ఏఎస్ఐ కృష్ణుడు

పగిడ్యాల: దిగువ ప్రాంత రైతులకు ఆయకట్టు నీరు రాకుండా ఎగువ ప్రాంతంలోని టీడీపీకి చెందిన మాజీ ఉప సర్పంచ్ శ్రీరాములు, పుల్లమ్మ, పలువురు రైతులు గుడ్డోళ్ల మోరీ పంట కాల్వను ఆక్రమిస్తూ రాతి కట్టడాలు కడుతున్నారని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు శనివారం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుడ్డోళ్ల మోరీ పంట కాల్వ కింద సుమారు 100 ఎకరాల భూమి ఉందని, ఇందులో ఎకరం, అర ఎకరం కలిగిన రైతులే ఎక్కువగా ఉన్నారని బాధితులు రాముడు, తిరుపాలు, ఉసేన్, షరీఫ్, రోశన్న, గొల్ల బిచ్చన్న, ప్రమీలారెడ్డి, జల్లి శేఖర్, బండారు శేఖర్, బండారు శ్రీను మరి కొంత మంది పోలీసులకు వివరించారు. ఎస్ఐ జయశేఖర్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ కృష్ణుడు కాల్వను పరిశీలించారు. ఇరువర్గీయులతో మాట్లాడారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, గొడవలు పెట్టుకుంటే చట్టపరంగా ఇరువర్గీయులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం కాల్వ ఎన్ని లింకులు ఉంటుందో సర్వేయర్ ద్వారా కొలతలు వేయించుకోవాలని ఇరువర్గాల రైతులకు సూచించారు. పొలం తగదాలు, సరిహద్దు రాళ్లు, పంట కాలువల ఏర్పాటు నీటిపారుదల, రెవెన్యూ అధికారులకు సంబంధించినవని, వీటిపై గొడవలు పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఇరువర్గాలను హెచ్చరించి పంపివేశారు.


ఆత్మహత్యపై విచారణ



వెంకటరమణ ఆత్మహత్యపై విచారణ చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: ఈనెల 20వ తేదీన మండలంలోని సింగరాజుపల్లె గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటరమణ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వెంకటరమణ ఆత్మహత్యపై శనివారం తహసీల్దార్ తిరుపతయ్య, మండల వ్యవసాయాధికారి కె.మహేష్, ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్‌లు విచారణ చేపట్టారు. ఎక్కడెక్కడ ఎంత అప్పులు చేశాడు, పంటల సాగుకు, అవసరాలకు ఎంతఖర్చు చేశాడనే వివరాలపై మృతుని భార్య లక్ష్మీదేవిని ఆరాతీశారు. పంటలకోసం తీసుకున్న క్రాప్‌లోన్లు, బంగారుణాలు ఇతరవాటిపై గ్రామస్థులతో కూడా విచారణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతుడు పంటల సాగుకోసం, ఇతర ఖర్చుల నిమిత్తం సుమారు రూ.10 లక్షలకు పైనే అప్పులు చేశాడన్నారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

అతిసారం బాధితులకు పొదుపు రుణాలు



అతిసారం బాధితులను పరామర్శిస్తున్న వైకెపీ ఏపీఎం అంబమ్మ, సీసీలు

జూపాడుబంగ్లా: మండలంలోని చాబోలు గ్రామంలో అతిసారం వ్యాధి బారిన పడిన బాధితులు మెరుగైన చికిత్స చేయించుకునేందుకు పొదుపు రుణాలు మంజూరు చేస్తామని వైకెపీ ఏపీఎం అంబమ్మ తెలిపారు. శనివారం ఆమె గ్రామానికి చేరుకొని అతిసారం వ్యాధి బారిన పడిన వారిని పరామర్శించారు. బాధితుల్లో 20 మంది పొదుపు మహిళలు ఉన్నట్లు తెలిపారు. వారు అతిసారం వ్యాధి బారిన నుంచి కోలుకోవటానికి అవసరమైన చికిత్స చేయించుకునేందుకు రుణాలు ఇస్తామని భరోసా నిచ్చారు. ఈమె వెంట అకౌంటెంటు రమేష్, సీసీలు గాంధీ, నాగన్న పాల్గొన్నారు.

అమ్మవారికి పౌర్ణమి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కొలను భారతిదేవి అమ్మవారు



అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: శివపురం గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి క్షేత్రంలో చదువుల తల్లి సరస్వతీ దేవికి శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ఆలయ పురోహితులు ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజాధిక్రతువులు నిర్వహించారు. శనివారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారిని సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి భక్తశ్రద్ధలతో కాయకర్పూరం సమర్పించి పూజించారు. అదేవిధంగా వారి చిన్నారుల భవిష్యత్తు దేదీప్యమానంగా వెలుగొందాలని మొక్కు చెల్లించుకొని, కుటుంబ సమేతంగా అమ్మవారి సన్నిధిలో శాస్త్రోక్తంగా ఆలయ పురోహితులు వేదమంత్రాల నడుమ అక్షరాభ్యాసాలు చేయించుకున్నారు. సుమారు 31 మంది చిన్నారులకు అర్చకులు బీజాక్షరాలు దిద్దించారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి



చిట్యాల వెంకటరెడ్డి (ఫైల్)

ఆత్మకూరు: ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిట్యాల వెంకటరెడ్డి(63) శనివారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చిట్యాల వెంకటరెడ్డి మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలియజేశారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



జూపాడుబంగ్లాలో అన్నదానం నిర్వహిస్తున్న సిద్దేశ్వరం పేట రైతులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమిని ప్రజలు, రైతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ పనిముట్లకు, పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వ్యవసాయ పనులను మొదలుపెట్టారు. మండల పరిధిలోని బొల్లవరం గ్రామం వద్దనున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఏరువాకపౌర్ణమి

జూపాడుబంగ్లా: ఖరీఫ్ పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ స్థానిక సిద్దేశ్వరంపేట రైతులు నాగిరెడ్డిస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఘనంగా ఏరువాకపౌర్ణమి వేడుకలు జరుపుకున్నారు. పూర్వం నుంచి ప్రతి ఏటా ఏరువాక పౌర్ణమి నాడు నాగిరెడ్డి స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అహోబిలంలో పౌర్ణమి పూజలు



ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవ నిర్వహిస్తున్న పండితులు

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యపూజల అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను దిగువ అహోబిలం ఆలయ ఆవరణలోని అద్దాల మండపం ముఖద్వారంలో ఏర్పాటు చేసిన యాగశాలలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి దూపదీపాలతో మహామంగళహారతి ఇచ్చి నైవేద్యం నివేదించారు. రాత్రి విశేషాలంకరణలో స్వామి ఉభయ దేవేరులతో కొలువుదీరి మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక



స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్‌స్కూలు విద్యార్థులు 13 మంది నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ నాగరవీంద్ర తెలిపారు. శనివారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఆయన మాటాడుతూ విద్యార్థులు జయంత్ ఆచారి, శ్రీవేదన్, రాముగౌడు, జయ భాస్కర్, మణికంత, జగదీశ్వర్, మహేష్, వస్మితాబాయి, నిప్పి జ్యోతిక, జయశ్రీ, మేఘన, సుజాత ఎంపికయ్యారని వివరించారు. వీరందరూ 2023–24 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదవుతున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులకు 9, 10, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం వరకు 4 సంవత్సరాల పాటు ఏడాదికి రూ.12 చొప్పున ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు.

బోయ రాముడికి వైఎస్సార్‌సీపీ నేతల నివాళి



నివాళులర్పిస్తున్న శిల్పా భువనేశ్వరరెడ్డి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మున్సిపాలిటీ 21వ వార్డు కౌన్సిలర్ బోయ లక్ష్మమ్మ భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోయ రాముడు (పోస్టల్ రాముడు) అనారోగ్యంతో శుక్రవారం మరణించిన విషయం తెలిసిందే. ఆయనకు శనివారం అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఆయన పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి, పార్టీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ఆత్మకూరు మున్సిపాలిటీ కో – ఆప్షన్ సభ్యుడు రషీద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

మౌనస్వామి ఆశ్రమంలో చండీ హోమం



ఆశ్రమంలో చండీ హోమం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మౌనస్వామి ఆశ్రమంలో శనివారం మూలనక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి లోక కళ్యాణార్థం చండీ హోమాన్ని నిర్వహించారు. దేశ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని సంకల్పిం పఠించారు. హోమం అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఆశ్రమ నిర్వాహకురాలు మంజుల, బీజేపీ జిల్లా బీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సుమలత, ఆశ్రమ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, అఖిల భారత వీరసేవ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మంజునాథ్, రాష్ట్ర హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగైన ప్రకృతి సోయగం



చెట్టు మీద చెట్టు (నాడు)



చెట్టు కనుమరుగైన ప్రాంతం (నేడు)

పాములపాడు: సృష్టిలో ప్రకృతి అందాలు చూపరులను ఎంతగానో అకట్టుకుంటాయి. అలాంటి అందాలు ఒకటికి మించి మరొకటి ఉంటాయి. అలాంటి ప్రకృతి సోయగం నేషనల్‌హైవే నిర్మాణ పనుల్లో కనుమరుగవ్వడం ప్రకృతి ప్రేమికులను ఎంతగానో కలిచివేసింది. కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి పక్కన మండలంలోని కంబాలపల్లి–ఎర్రగుడూరు గ్రామాల మధ్య, అలాగే జూటూరు కృష్ణారావుపేట గ్రామాల మధ్య మలుపుల్లో రావి చెట్టుపై తాటి చెట్టు పెరిగి కనువిందు చేస్తుండేవి. బస్సులో ఎటు వైపు కుర్చున్నా మండలంలో ఈ దృశ్యాలు కన్పిస్తాయి. ఎందుకంటే ఒక చెట్టు కుడి వైపు, మరో చెట్టు ఎడమ వైపు ఉన్నాయి. బాటసారులను, వాహన చోదకులకు కనువిందు చేస్తున్న ఈ భారీ వృక్షాలు నేషనల్ హైవే పనుల్లో రెండు ప్రాంతాల్లో నేలమటం చేయబడ్డాయి.

చెత్తను తొలగించండి



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను చూపుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి ప్రజలను విషజ్వరాల నుంచి కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు ఎస్.స్వాములు, ఎ.సురేంద్ర, షేక్ఇస్మాయిల్, డి.రామునాయక్ కోరారు. శనివారం సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ప్రతినిధి బృందం పట్టణంలోని పలు వీధుల్లో చెత్త కుప్పలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని 24 వార్డులతో పాటు మెయిన్ రోడ్డు వెంట ప్రధాన కూడళ్లలో చెత్తను రోజూ శుభ్రం చేయాల్సి ఉండగా.. డంపు యార్డుకు రోడ్డు లేదనే నెపంతో ఎక్కడ వేసిన చెత్త అక్కడే వదిలేస్తున్నారన్నారు. కర్నూలు–గుంటూరు రోడ్డు వెంబడి, విధుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, అదేవిధంగా వీధుల్లో చెత్త పేరుకుని రోడ్లపైకి రావడంతో చిన్నపాటి వర్షానికి దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.